

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖలో

బద్ధకస్తులపై వేటు

● 16 మంది గ్రేడ్-2 ఏఈలు విధుల నుంచి తొలగింపు



కడప(రూరల్), అక్టోబరు 6: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖలో విధులకు రాని వారిపై వేటుపడింది. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు 16 మంది గ్రేడ్-2 ఏఈలను విధుల నుంచి తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వం వీరిని నియమించింది. ఈ మేరకు వారు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడమే కాకుండా గత రెండేళ్ల నుంచి వారు ఉన్నతాధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్నారు. చట్టబద్ధమైన విధుల్లో విచక్షణారహితంగా వ్యవహరించడంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఉన్నతాధికారులు అనేక షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కానీ సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇప్పటి వరకు వివరణ కూడా ఇవ్వలేదు. అలాగే డివిజన్లలో సమర్పించిన సమాచారం ప్రకారం వారు ఎక్కడున్నారో కూడా తెలియలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడుకలో ఉన్న సీసీఏ నిబంధనల ప్రకారం వారిపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించి విధుల నుంచి తొలగించారు. ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం నుంచి విధులకు అనధికారిక గైర్హాజరైన వారి పేర్లు ఇలా ఉన్నాయి.

తొలగించబడిన ఏఈల వివరాలు

ఎం.ఈశ్వరకుమార్‌యాదవ్(యదురూరు సచివాలయం), వి.మానస(బలసింగాయపల్లె), కె.దినేష్‌రెడ్డి (కొలుములపల్లి), జె.సందీప్ (యల్లారెడ్డిపల్లి), టి.తరుణ్ (దుగ్గాయపల్లి), ఎం.గోపి (పాయసంపల్లి), బి.నిర్మల (అలిదెన), ఎం.ధనుంజయ (అప్పయరాజుపేట), డి.మౌనిక (నల్లబల్లె), కె.నాగేంద్రబాబు (కలవాయి), పి.మౌనిక (చిన్నంపల్లి), ఆర్.యోగానంద (యల్లయపల్లి), బుక్కే ఉష (బోడిరెడ్డిగారిపల్లి), నాగశ్రావణి (చిన్నమండెం-1), వి.విశ్వనాధం (సూర్యనారాయణపురం), సి.క్రాంతికుమార్‌రెడ్డి (రేగడిపల్లి)



విధులకు అబ్‌స్కాండ్ కావడం వల్లే తొలగింపు..

ఉమ్మడి కడప జిల్లా పంచాయతీ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో ఉండే 16 మంది గ్రేడ్-2 అసిస్టెంట్ ఇంజనీర్లు పై అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సంవత్సరాల తరబడి విధులకు అబ్‌స్కాండ్ అయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పై వారిని తొలగించాం.

- శ్రీనివాసులరెడ్డి, ఎస్ఈ



పచ్చాని.. రంగేసినట్టు..!

పచ్చని పంట పొలాలు.. చుట్టూ కొండలు.. పల్లెటూరు అందాలు.. పరవళ్లు తొక్కుతున్న సెలయేర్లు.. పక్షుల కిలకిలరావాలు.. 'మా పల్లె అందాలు చూచుట కనువిందురో' అని ఓ కవి రాసిన పాటకు అద్దం పడుతున్నాయి. సిద్దవటం మండల పరిధిలోని మూలపల్లె, మాచుపల్లె పరిసర ప్రాంతాల్లో ఈ మనోహరమైన దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టి పడేస్తున్నాయి. ముఖ్యంగా దసరా సెలవులు, వీకెండ్ కావడంతో కుటుంబ సభ్యులు, యువత ఎక్కువగా వీటిని ఆస్వాదించేందుకు ఇటువైపు వస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేస్తే

చూస్తూ ఊరుకోం

● పార్లమెంట్‌లో ఆ విషయంగా చర్చ జరపాలి

● లేదంటే చలో పార్లమెంట్‌కు పిలుపు

● అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

కడప(మారుతీనగర్), అక్టోబరు 6: రాజ్యాంగ విరుద్ధంగా మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేలా ఎస్సీ వర్గీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు హర్షకుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. శనివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం యస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చాయని ఆరోపించారు. పైపెచ్చు మాలలకు అన్యాయం జరిగేలా సుప్రీంకోర్టును సైతం తప్పుదారి పట్టించి మాదిగలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం విచారకరమన్నారు. ఆర్టికల్ 341ను సవరణ చేయకుండా యస్సీ వర్గీకరణ సాధ్యం కాదన్నారు. ఆ విషయంగా రిట్ వేసినప్పటికీ సుప్రీంకోర్టు తోసిపుచ్చడం బాధాకరమని తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు గొప్పదా... లేక రాజ్యాంగం గొప్పదా అనే అంశం తెరపైకి వచ్చిందని, రాజ్యాంగాన్ని పార్లమెంటే సవరించగలదన్నారు. ఇదిలా వుండగా గతంలో యస్సీ వర్గీకరణను వ్యతిరేకించిన పార్టీలు కూడా ప్రస్తుతం మౌనంగా వుండడం విడ్డూరంగా వుందన్నారు. ముఖ్యంగా రాజ్యాంగ ఉల్లంఘనకు దేశ ప్రధాని బాధ్యత వహించాలని, ప్రధానంగా చట్టాన్ని అనుసరించి సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వాలన్నారు. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో యస్సీ వర్గీకరణ విషయంగా పార్లమెంట్‌లో అజెండా పెట్టాలని కోరామని, కావున పార్లమెంట్‌లో చర్చ జరిపి తీరాలన్నారు. అలా లేనిపక్షంలో తమపోరుకు కలిసి వచ్చే పార్టీలతో చలో పార్లమెంట్‌కు పిలుపు ఇస్తామని, సుప్రీంకోర్టు తీర్పుకు బ్రేకు లేసేలా యస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరు సాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ టెర్రరిజం



సర్వస్వం ఇప్పుడు మొబైల్‌మయం అయిపోయింది. బ్యాంకుల్లో స్టేట్‌మెంటు నుంచి ఫోన్‌పే, డిజిటల్ పేమెంట్లు ఇలా అన్ని లావాదేవీలకు మొబైల్ కీలకం. అందుకే దీనిని అస్త్రంగా వాడుకుంటున్నారు. ఎక్కడుంటారో తెలియదు. ఏం చేస్తారో తెలియదు.. వారికి తెలిసిందల్లా స్పష్టమైన తెలుగు, ఇంగ్లీషు, హిందీ మాట్లాడడం. హై ప్రొఫైల్ ఉన్న వ్యక్తులు ఆర్థికంగా బలంగా ఉన్న వారినే ఎంచుకుంటారు. వారినే టార్గెట్ చేసి దేశంలో అత్యున్నత సంస్థల పేర్లు చెప్పి ఉక్కిరిబిక్కిరి చేసి కోట్లాది రూపాయలను కొల్లగొడుతున్నారు. ఇప్పుడు ఈ సైబర్ టెర్రరిజం చాలా ప్రమాదకరంగా మారింది. నిన్న మొన్నటి వరకు మెట్రోసిటీకే పరిమితమైన ఈ సైబర్ టెర్రరిజం ఇప్పుడు మనజిల్లాకు కూడా పాకింది. దేశంలోనే అత్యున్నత సంస్థల పేర్లు చెప్పి బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి రూ.3.35 కోట్లు కొట్టేశారు. ఇది అధికారికంగా నమోదైన కేసులకు సంబంధించి మాత్రమే. ఇది కాకుండా బయటికిరాని వారి గురించి చెప్పుకుంటే రూ.10కోట్లకు పైమాటే ఉంటుంది. అయితే సైబర్ టెర్రరిజం ముఠాలో దొరికిన వారెవరూ అక్షరజ్ఞానం లేని వారు, మొబైల్ ఫోనుపై అవగాహన లేని వారేం కాదు. హై ప్రొఫైల్ వైద్యులు ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు కావడం గమనార్హం.



● దడ పుట్టిస్తున్న డిజిటల్ అరెస్టులు
● వైద్యులు, ఉన్నత వర్గాలే టార్గెట్
● సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్లు
● మీపై కేసులు నమోదయ్యాయంటూ..
● వీడియోకాల్స్ ద్వారా భయపడే విధంగా విచారణ
● ఇప్పటికే జిల్లాలో సైబర్ నేరగాళ్లు రూ.3.50 కోట్లు కొల్లగొట్టారు

(కడప-ఆంధ్రజ్యోతి): పంటలకు చీడ పడినట్లుగా ఇప్పుడు సమాజానికి సైబర్ టెర్రరిజం చీడ పట్టుకుంది. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇందులో మోసపోతున్నది చదువురాని వారు కాదు.. బాగా చదువుకున్న వారు, ఉన్నత స్థానాల్లో ఉన్నవారే కావడం విశేషం. జిల్లాలో ఇప్పటికే డిజిటల్ అరెస్టు అంటూ బెదిరింపులకు దిగిన సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.3.50 కోట్లు పోగొట్టుకున్నారు. దీనికి ఒకటే నిర్మూలన. అనుమానిత, బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడమే. రోడ్డుప్రమాదం జరిగినప్పుడు గుండెపోటు సంభవించినప్పుడు తొలి గంటలో బాధితున్ని ఆసుపత్రికి చేర్చడాన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఆ సమయంలో వెళితే ప్రాణాన్ని కాపాడుకోవచ్చు. అలాగే ఇప్పుడు కూడా సైబర్ నేరగాళ్ల వలలోపడి డబ్బులు పోగొట్టుకున్న తొలి గంటలోపే పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోయిన సొమ్ము రాబట్టుకోవచ్చు. అలా కాకండా ఆలస్యం చేస్తే ఆ సొమ్ము రావడం గగనమే.

వామ్మో సైబర్ నేరగాళ్లు

● కడపలోని ఓ ఇంజనీరింగ్ అధికారికి సైబర్ ముఠా ఫోన్ చేసింది. మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం. మీపై మనీలాండరింగ్ కేసు నమోదైంది. ఇతరత్రా ద్వారా మీ ఖాతాలోకి నగదు జమ అయింది. ఈ కేసు మాకు అప్పగించారు. అంటూ.. అతడి ఆధార్‌నెంబరు, పాస్‌పోర్టు వివరాలు చెప్పి ఇవి మీవేనా అన్నారు. ఆ అధికారి అవునని చెప్పారు. తనకు ఏ సంబంధం లేదన్నారు. సరే మేం చెప్పిన వివరాలు ఇవ్వు, అన్నీ మ్యాచ్ అయితే మీరు సేఫ్ అంటూ వ్యక్తిగత వివరాలు అడిగారు. ఒక లింకు పంపించారు. సీబీఐ, ఈడీ కేసులు అనడంతో ఆ అధికారి బెంబేలెత్తిపోయారు. వెంటనే ఆ లింకులో వారు అడిగిన సమాచారాన్ని పంపించారు. అంతే.. ఆయన అకౌంటులో ఉన్న రూ.2.34 కోట్లు మాయం అయింది.

● కడప నగరానికి చెందిన మరో రిటైర్డ్ వైద్యాధికారి ఈ ఏడాది జనవరిలోనే రిటైర్ అయ్యారు. కొడుకు, కోడలు వద్ద జీవిత చరమాంకం గడుపుతున్నారు. ఆయనకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మేం ముంబైలో నార్కో అనాలసిస్ నుంచి మాట్లాడుతున్నాం. మీ పేరిట డ్రగ్స్ సరఫరా అయింది. మీపై కేసు నమోదైంది. ఇప్పటికే మా సిబ్బంది మీ ఇంటిని చుట్టుముట్టారు అంటూ నేరుగా వాట్సప్‌కాల్‌లో ఆ అధికారిని బెదిరించారు. నేను కాదు అని మొత్తుకున్నా కూడా ముంబై నార్కో అనాలసిస్ కార్యాలయం కనిపించే విధంగా వీడియోకాల్స్‌లో మాట్లాడడం చూసి అవాక్కయ్యారు. ఈ విషయం బయటపడకుండా ఉండాలంటే సెటిల్ చేసుకుందాం, మీ బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వండి అంటూ బెదిరించడంతో రిటైర్డ్ డాక్టరు భయపడి వివరాలు ఇచ్చేశారు. అంతే.. ఆ ముఠా వరుసగా రూ.50లక్షలు దోచేసింది. ఈ విషయం కోడలు గమనించింది. మామా ఎవరికైనా డబ్బులు పంపిస్తున్నారా అని అడగడంతో పాటు డల్‌గా ఎందుకున్నారని ప్రశ్నించింది. జరిగిన విషయం చెప్పుకొచ్చారు. వెంటనే సైబర్ క్రైంను కలిశారు.

● కడపలోని మరో డెంటల్ వైద్యునికి కాల్ వచ్చింది. ఈడీ అధికారులమంటూ ఫోను వచ్చింది. మీ ఖాతాలోకి విదేశీ నిధులు వచ్చాయంటూ బెదిరించారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు మీ బ్యాంకు వివరాలు చెబితే అవన్నీ ఓకే అయితే మీపై కేసు ఉండదు, మీ డబ్బులకు ఎలాంటి ప్రాబ్లం ఉండదని చెప్పారు. వివరాలు అన్నీ తెలుసుకుని అందులో ఉన్న రూ.30లక్షలు కొట్టేశారు.

● ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు మీరు డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారంటూ ఒకరి నుంచి రూ.6లక్షలు, మరొకరి నుంచి రూ.5లక్షలు కాజేశారు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇప్పటివరకు జిల్లాలో 10 కేసులు నమోదయ్యాయి, సుమారు రూ.3.5 కోట్లు కొల్లగొట్టారు.

సినిమాను తలపించే విధంగా..

ఇటీవలే తమిళ హీరో సూర్య నటించిన గ్యాంగ్ సినిమా విడుదలైంది. అందులో హీరో సూర్య పాత్ర నకిలీ సీబీఐ అధికారిగా ఉంటుంది. సినిమా కాబట్టి అక్రమార్కులపై పడి సొమ్ము లాగేసుకుంటారు. ఇక రెండు దశాబ్దాల క్రితం నాగార్జున నటించిన సినిమా ఒకటి వచ్చింది. అందులో నాగార్జున అనుచరులుగా ఉన్న బ్రహ్మానందం మేం ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ వాణిశ్రీ ఇంట్లోకి వచ్చి నానా హంగామా చేస్తారు. ఇప్పుడు అదే తరహా సీన్ సైబర్ నేరగాళ్లు సృష్టిస్తున్నారు. సీబీఐ, ఈడీ, నార్కోటిక్ నుంచి మాట్లాడుతున్నామంటూ వాట్సప్, స్కైప్, ఈమెయిల్, జూమ్, గూగుల్‌మీట్, ఇతర వీడియోకాల్ యాప్‌ల ద్వారా నేరుగా ఫోను చేస్తారు. సినిమాను తలపించే విధంగా నార్కోటిక్ అధికారుల మంటే బ్యాక్‌గ్రౌండ్‌లో ముంబై, నార్కోటిక్స్ ఆఫీసులాగా చూపించడం.. అక్కడ పేరుకు తగ్గట్లు బలంగా ఉన్న హైటు వెయిటు ఉన్న అధికారులను చూపించడం, ఇక కలకత్తా నుంచి ఫోన్లు చేస్తున్నామని చెన్నై ఎయిర్‌పోర్టు, ఢిల్లీ నుంచి ఫోన్లు చేస్తున్నామంటూ అందుకు తగ్గట్టుగా పర్సనాలిటీ హైటు వెయిటు డ్రస్సు వేసుకుని వీడియోకాల్స్‌తో ఉక్కిరి బిక్కిరి చేస్తారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ మాట్లాడతారు. ఇక హైప్రొఫైల్ ఉన్నవారికి మాత్రమే ఫోన్ చేస్తారు. వారి వివరాలు తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఇప్పటికే మా అధికారులు మీవద్దకు వచ్చారు. మీ ఇంటి పక్కనే ఉన్నారు. ఈ ఇష్యూ ఇంతటితో అయిపోవాలంటే సెటిల్ చేసుకుందాం, మీరు నేరుగా కలవాల్సిన పనిలేదు. మేం చెప్పిన అకౌంటుకు డబ్బులు జమ చేయండంటూ బెదిరిస్తున్నారు. ఇక వీడియోకాల్స్‌లో వారి బ్యాక్ గ్రౌండు, డ్రెస్సులు, వారు అడిగే ప్రశ్నలు, ఇవన్నీ చూసి ఇదంతా నిజమేనేమోనని, మాపై కేసులు ఉన్నాయేమో అని భయపడి తమ వివరాలు చెప్పేయగా.. మరికొందరు వారు చెప్పిన అకౌంట్లలో డబ్బు జమ చేస్తున్నారు. విషయం బయటికి చెబితే పరువుపోతుందని భయపడుతున్నారు.

జీవిత చరమాంకంలో భయపడి..

ప్రభుత్వ వైద్యులుగా, ఇంజనీర్లుగా ఉన్నతమైన ఉద్యోగాలు చేసిన వారు పదవీ విరమణ తరువాత కొడుకో, కూతురు వద్దనో ఉంటున్నారు. అయితే వారికి వచ్చే ఈ ఫోన్ల బ్లాక్‌మెయిల్స్‌తో బయటికి చెప్పుకుంటే కూతురు, కోడలు, అల్లుడు ముందు పరువుపోతుందనే భయంతో బయట చెప్పకుండానే.. లోలోపలే బాధపడుతూ సైబర్ నేరగాళ్లకు ఎరగా మారుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేయండి..

సైబర్ నేరాగాళ్ల నుంచి ఎవరైనా ఇలా కాల్ చేసి మీపై సీబీఐ కేసులు, ఈడీ కేసులు నార్కోటిక్స్ నుంచి ఫోన్లు చేస్తున్నామని బెదిరిస్తే భయపడవద్దు. వారు చెప్పిన మాటలు నమ్మి డబ్బులు ఇవ్వవద్దు. వెంటనే మీరు సైబర్ క్రైం కాల్ సెంటరు 1930కి కాల్‌చేయండి. ఫిర్యాదు చేయండి. లేదా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయండి, మీకు సంబంధించిన ఆధార్, పాన్‌కార్డు వివరాలను వారికి తెలపవద్దు. సైబర్ నేరగాళ్లు ఈమెయిల్ లేదా, సోషల్ మీడియా ద్వారా మీపై వల వేస్తారు. అనుమానాస్పద వ్యక్తులు అయితే వారికి స్పందించవద్దు. డిజిటల్ అరెస్టు పేరిట మీరు నేరం చేయకపోయినా బెదిరించి మీ బ్యాంకు ఖాతాలు సీజ్ చేస్తామని బెదరిస్తారు. అలాంటి వారిని పట్టించుకోవద్దు. మీ వ్యకిగత సమాచారం ఇవ్వవద్దు.

- హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ

పులివెందుల మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. ప్రతినెల విద్యుత్ బిల్లులు రూ.95లక్షలు దాటుతున్నాయి. ఇప్పటికే రూ.35కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. మున్సిపల్ ఆదాయం ఏడాదికి రూ.11కోట్లుగా అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ ఆదాయానికి విద్యుత్ బిల్లులు పోటీ పడుతున్నాయి. ఇలా అయితే మున్సిపాలిటీ అభివృద్ధి ఎలా సాధ్యమనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

విద్యుత్ బకాయిల పులి



● పేరుకుపోయిన రూ.35కోట్ల విద్యుత్ బకాయిలు
● గుదిబండలా మారిన రింగురోడ్డు వీధిలైట్లు
● పులివెందుల మున్సిపాలిటీ ఆదాయం విద్యుత్ బిల్లులకే సరి

పులివెందుల, అక్టోబరు 6: పులివెందుల మున్సిపాలిటీ విద్యుత్ బిల్లుల దెబ్బకు హడలిపోతోంది. విద్యుత్ బిల్లులు చెల్లించాలంటే దానికి తగ్గట్టు ఆదాయం కనిపించడం లేదు. పులివెందుల మున్సిపాలిటీలో హెచ్‌టీ (హై టెన్షన్) కింద రూ.30లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఎల్‌టీ కింద రూ.65లక్షలు వస్తోంది. అంటే ప్రతి నెల రూ.95లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. అ లెక్కన ఏడాదికి రూ.11.40కోట్ల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఇప్పటి వరకు విద్యుత్ బకాయిల వివరాలు చూస్తే హెచ్‌టి కింద రూ.9కోట్లు, ఎల్‌టి కింద రూ.26కోట్లు.. మొత్తం రూ.35కోట్ల బకాయిలు ఉన్నట్లు మున్సిపాలిటీ అధికారిక లెక్క.

ఆదాయాన్ని మించిన విద్యుత్ బిల్లులు

మున్సిపాలిటీ ఆదాయ వివరాలు చూస్తే ఏడాది పొడవునా వివిధ పన్నుల రూపంలో వచ్చే ఆదాయం చూస్తే రూ.11కోట్లు. మున్సిపాలిటీ మొత్తం ఆదాయం కూడా విద్యుత్ బిల్లులకు సరిపోవడం లేదు. ఎందుకు ఈ స్థాయిలో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని మున్సిపాలిటీలోని ఓ అధికారిని ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా.. ప్రజలకు సౌకర్యవంతంగా వీధిలైట్లను ఏర్పాటుచేయడంతో ఎక్కువ బిల్లులు వస్తున్నాయన్నారు. ప్రజలు ఎక్కువగా తిరగకపోయినా రింగురోడ్డు చుట్టు హైమాక్స్ లైట్లు, వీధిలైట్లు ఎక్కువగా ఏర్పాటుచేయడం కూడా మున్సిపాలిటీకి అధిక భారమైందన్నారు.

అభివృద్ధి సరే.. ఆదాయమేదీ..?

2019 నుంచి 2024 వరకు పులివెందుల ఎమ్మెల్యే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. పులివెందుల మున్సిపాలిటీని మోడల్ టౌన్‌గా మార్చేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా రింగురోడ్డు సుందరీకరణ పనులకు వందలకోట్లు వెచ్చించారు. ఇందులో భాగంగానే అడుగడుగునా వీధిలైట్లు, హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేశారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా మున్సిపాలిటీకి ఆదాయం మాత్రం పెరగలేదు. ఆదాయం పెరగకపోవడంతో విద్యుత్ బకాయిలు మున్సిపాలిటీకి తడిసిమోపెడు అవుతున్నాయి. ఏడాదిలో రెండుమూడు సార్లుగా రూ.30లక్షలు, రూ.50లక్షలు, రూ.90లక్షలు ఇలా విద్యుత్ బకాయిలు చెల్లిస్తుంటామని అధికారి పేర్కొన్నారు. ఆ అధికారి లెక్కల ప్రకారం చూస్తే ఏడాదిలో రూ.1.50కోట్ల నుంచి రూ.1.70కోట్ల మేరకు బకాయిలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ విద్యుత్ బిల్లులు ఏడాదిలో రూ.11కోట్లు దాటుతుండడం చూస్తే ఇవి పెరిగే బకాయిలు తప్ప తరిగే బకాయిలలా లేవు. మున్సిపాలిటీ విద్యుత్ బకాయిలతోనే సతమతమవుతోంటే మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎలా సమకూర్చుకుంటుందో అర్థంకాని ప్రశ్నగా మిగులుతోంది. తాగు నీటి అవసరాలకు, అభివృద్ధి పనుల కోసం వెచ్చించాల్సిన నిధులు ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. ఏదిఏమైనా పులివెందుల మున్సిపాలిటీ విద్యుత్ బకాయిలతో సతమతమవుతోందని నగ్న సత్యం.



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

మాతా అన్నపూర్ణేశ్వరి..



విజయదుర్గాదేవి ఆలయంలో కలశంతో దుర్గాప్రసాద్

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారిని పలు రూపాలలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రొద్దుటూరులోని అమ్మవారిశాలలో, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో గజలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులను కరుణించారు. కడప నగరంలోని అమ్మవారిశాల వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి గజలక్ష్మీదేవి అలంకారంలో, విజయదుర్గాదేవి ఆలయంలో కూష్మాండ దేవిగా, నగరంలోని ఆకులవీధిలో వెలసిన రాజ రాజేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, నబీకోట చౌడేశ్వరిదేవి ఆలయంలో గజలక్ష్మీదేవిగా, గడ్డిబజారులోని బాలాజీ ఆలయంలో లక్ష్మీదేవి అలంకారంలో, సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో రాధాకృష్ణుల అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు.



కూష్మాండ అలంకారంలో విజయదుర్గాదేవి

- కడప(కల్చరల్)/ప్రొద్దుటూరు టౌన్

'జీఓ 56ను ఉపసంహరించుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 6 : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల సాంకేతిక కేంద్రం ఎంఎస్ఎంఈ కొప్పర్తి నుంచి అమరావతి తరలింపునకు ఇచ్చిన జీఓ నెం.56ను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ రంగాల్లో శిక్షణ నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటరును అమరావతికి తరలించడం సరికాదన్నారు. ఈ ఎంఎస్ఎంఈ ద్వారా యువతకు ప్రపంచ స్థాయి స్కిల్ డెవలప్‌మెంటు ట్రైనింగ్‌తో పాటు వివిధ ఇంజనీరింగ్ టెక్నాలజీ కోర్సులు, డిప్లమా ప్రోగ్రామ్‌లు అందించవచ్చన్నారు.కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల నాయకులు గంగాధర్, మహేశ్, చరణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

'పీఆర్‌సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలి'


మాట్లాడుతున్న సీవీ ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 6:12వ పీఆర్‌సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వపీఆర్సీ అమలు పర్చాల్సిన గడువు 14 నెలలు దాటినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించేలా 10వతేదీ నాటి కేబినెట్‌లో నిర్ణయించాలని కోరారు.కమిటీ అన్ని జిల్లాల్లో పర్యవేక్షించి ఉద్యోగ ఉపాధ్యాయ అభిప్రాయాలను సేకరించాలన్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌చంద్ర, ఉమాకాంత్ మాట్లాడారు. జిల్లా నాయకులు రాజగోపాల్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయం గణేష్‌పురం

- సైడ్ కాల్వలు లేక రోడ్లపై పారుతున్న మురుగు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకునే నాథుడు కరువు


గణేష్‌పురంలో వానకు రొచ్చు రొచ్చుగా మారిన రోడ్డు

వల్లూరు, అక్టోబరు 6:వాన వస్తే చాలు.. నడవాలంటే నరకమే. సరైన దారి లేక, సైడ్ కాల్వలు లేక మురుగునీరు వాననీరు కలిసి రోడ్లపై పారుతుంటుంది. అలాగే అక్కడంతా దోమలు విపరీతంగా ఉంటాయి. ఆ దోమల వల్ల వ్యాధుల బారిన పడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతంది. ఇలా నిత్యం సమస్యలవలయంలో కొట్టుమిట్టాడుతోంది గణేష్‌పురం. మండల కేంద్రానికి కొద్దిదూరంలో ఉన్న గణేష్‌పురంలో గత కొన్ని నెలలుగా సమస్యలు వెంటాడుతున్నాయి. సరైన రోడ్లు.. కాల్వలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరో పక్క వర్షం వచ్చిందంటే ఇక ప్రజలు బయటికి వెళ్లి అడుగు తీసి అడుగు వేయాలన్నా భయపడుతున్నారు. సైడ్ కాల్వలు లేక మురుగంతా రోడ్లపై పారుతూ వాననీటితో కలిసి పారుతుంటుంది. గణేష్‌పురానికి కూతవేటు దూరంలో బస్టాండు ఉంది. మండల కార్యాలయాలూ ఉన్నాయి. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ప్రజాప్రతినిధులు మాత్రం గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం అంటున్నారే తప్ప ఆచరణలో అమలు కావడంలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమ గణేష్‌పురం సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


గణేష్‌పురంలో వంకను తలపిస్తున్న రోడ్డు

రోడ్డుపై నడవాలంటే ఇబ్బందిగా ఉంది



వాన పడితే చాలు మా గ్రామంలో నడవడానికి ఇబ్బందిగా ఉంది. సైడ్ కాలవలు లేవు. దీంతో మురికంతా రోడ్లపై పారుతోంది. వాన వచ్చిందంటే ఇక అంతే. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాం. సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన నిధులు వచ్చిన వెంటనే తీరుస్తామని చెప్పారు. మరి ఇంత వరకు ఏమీ జరగలేదు. - మహబూబ్‌తార

నిధులు కేటాయించాం

ఈ గణేష్‌పురానికి నిధులు కేటాయించాం. ఈ బడ్జెట్‌లోనే వీటిని పూర్తి చేసి గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తాం. సైడ్ కాల్వలు పూర్తిచేసి రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూస్తాం. దీంతో సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. - ఎంపీడీఓ రఘురాం

వైవీయూలో ఆడిటోరియం నిర్మించాలి

- ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 6: వైవీయూలో ఆడిటోరియం నిర్మించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున డిమాండ్ చేశారు. ఆదివారం వైవీయులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్శిటీ పరిధిలోని గురుకులంలో విద్యార్థులు వెళ్లే దారికి రోడ్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.అలాగే కొత్త రోడ్డు నిర్మించాలని కోరారు. హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గురుకులంలో చదివే విద్యార్థులకు యూనివర్శిటీ ప్రత్యేక బస్సు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ యూనివర్శిటీ అధ్యక్షుడు హనరీఫ్, ఉపాధ్యక్షుడు జావీద్‌వలి, అరుణ్ ప్రేమ్ పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 6 : గత రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు చేయడంలేదని ఈ సంవత్సరం అయినా విడుదల చేయాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరబ్రహ్మం ఆదివారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023-24 సంవత్సరంలో ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. 2024-25 ప్రస్తుత విద్యాంసవత్సరంలో ఇప్పటికే నాలుగు నెలలు గడిచినా పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయలేదని దీంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం నిధులు విడుదల చేయాలని కోరారు.

శిల్పారామంలో దసరా సంబరాలు

కడప (కల్చరల్) అక్టోబరు 6: దసరా పర్వదినం సందర్భంగా శిల్పారామంలో ఆదివారం సంబంధిత పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో మిస్సా మూవీ సహకారంతో కడపకు చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమీ బృందం సారథ్యంలో పల్లె జానపద, శాస్త్రీయ, సినీ పాటల నృత్యాలు అలరించాయి. ఇందులో ఆయుధ పూజ, శివతాండవం, వస్తావజానకి, తదితర పాటలు ఆకట్టుకున్నాయి.

దసరా కానుకగా మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 6 : రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మధ్యంతర భృతి కల్పించాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై నూరు రోజులు పూర్తయినా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయలేదన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. అలాగే పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులు కరువు భత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని, సరెండరు లీవు బకాయిలు, ఏపీజీఎల్ఐ బకాయిలు, పీఎఫ్ రుణాలను చెల్లించాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు రమేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు రామచంద్రరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, నారాయణరెడ్డి, మస్తాన్‌బాబు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడపలో క్లబ్బులపై పోలీసుల దాడి


మాట్లాడుతున్న డీఎస్పీ రమాకాంత్

కడప (క్రైం), అక్టోబరు 6: కడప నగరంలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న క్లబ్బులపై దాడులు నిర్వహించారు. కడప తాలుకా పరిధిలోని ఓక్లబ్బుపై దాడి చేయగా నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్నారని వారిలో 17 మందిని అదుపులోకి తీసకున్నారు. వారివద్ద నుంచి రూ.3495 నగదును స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు క్లబ్బులపై దాడి చేయగా ఓ క్లబ్‌లో 17 మందిని అదుపులోకి తీసుకుని రూ.9540 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కడప డీఎస్పీ కార్యాలయంలో కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా క్లబ్బులో పేకాట నిర్వహిస్తే వారిపై దా డులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ, కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు, కడప రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయ సందర్శన తనివితీరనిది

- రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు


బ్రౌన్ సిబ్బందితో రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు

కడప (మారుతీనగర్), అక్టోబరు 6 :కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ఎన్ని సార్లు సందర్శించినా తనవి తీరని జిజ్ఞాస అనుభూతి కలిగిస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సాయంత్రం దాసరి శ్రీనివాసులు సీపీ బ్రౌన్‌ను సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ డా క్టర్ జానుమద్ది హనుమచ్ఛాస్త్రి తెలుగు ప్రజలకు ఒక గొప్ప విజ్ఞాన సౌధాన్ని అందించి బ్రౌన్‌కు శాశ్వత కీర్తిని ప్రసాదించారన్నారు.

కళాశాల వద్ద బస్‌షెల్టర్ నిర్మించండి


బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న విద్యార్థులు

వేముల, అక్టోబరు 6: మండల కేంద్రమైన వేములలోని కళాశాలల వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. వేములలోని ప్రభుత్వ ఐటీఐ, జూనియర్ కళాశాలలకు పులివెందుల, వేంపల్లె, తాళ్లపల్లె, కొత్తపల్లె, వేల్పుల తదితర గ్రామాల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు చదువుకునేదుకు వస్తుంటారు. అయితే వీరు తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచిఉండే సమయంలో ఇబ్బందులుపడుతున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో వర్షం వస్తే వర్షంలోను, ఎండలోనే నిలబడాల్సి వస్తోందని వాపోతున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించి రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ఆడబిడ్డ పేరు నమోదు చేసుకుని రూ.50 వేలు బహుమతి పొందండి

చెన్నూరు, అక్టోబరు 6 : చెన్నూరు రామలింగచౌడేశ్వరి దేవాలయంలో జరిగే దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడాది వయసున్న ఆడబిడ్డల పేర్లు నమోదు చేసుకుంటే లక్కీడ్రాలో వారికి రూ.50వేలు బహుమతి అందిస్తామని తెలుగు యువత మండల నేత గుగ్గిళ్ల చాణక్య అన్నారు. ఆదివారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరు 6 నుంచి ఈ ఏడాది అక్టోబరు 5వరకు ఈ మధ్యలో పుట్టిన ఆడపిల్లల పేర్లను తల్లిదండ్రులు రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో ఈ నెల 11లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకునేవారు తమ బిడ్డ పుట్టిన ధృవీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ నెంబరు, అడ్రస్‌ను ఇవ్వాలన్నారు, ఈ నెల 12న విజయదశమి రోజు ఆలయం వద్దలక్కీ డ్రా తీయడం జరుగుతుందని అందులో విజేత అయిన ఆడబిడ్డ పేరుతో రూ.50 వేలు స్థానిక బ్యాంకు నందు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తామని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫారంపాండ్‌లను ఏర్పాటు చేసుకోవాలి


పెద్దకుడాల గ్రామంలో చీనీతోటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న జాయింట్ కమిషనర్ శివప్రసాద్

లింగాల, అక్టోబరు 6: ప్రతి రైతు తమ తోటలలో ఫారంపాండ్‌లను ఏర్పాటు చేసుకోవాలని పీఆర్ అండ్ ఆర్‌డీ డిపార్ట్‌మెంట్ స్టేట్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. మండలంలోని పెద్దకుడాల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కింద జరిగిన పనులు, పండ్లతోటలు పెంపకం, పాఠశాలల్లో పచ్చదనం పెంచేందుకు నాటిన మొక్కలు, డ్రాగన్‌ఫ్రూట్ తోటలను పరిశీలించారు. ముందుగా చీనీతోటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మొక్కల సరఫరా, బిల్లులు తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు తమపొలాల్లో ఫారంపాండ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భూగర్భజలాలు తగ్గముఖం పట్టినపుడు ఫారంపాండ్‌లలో నీటిని నిల్వ చేసుకొని అవసరమైనపుడు వాడుకోవచ్చు అన్నారు. సరైన ప్రాంతంలో ఏర్పాటుచేసుకోవడం వల్ల భూగర్భజలాలు కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. నీటి వృథాను అరికట్టవచ్చన్నారు. అలాగే పెద్దకుడాల జడ్పీ హైస్కూల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలను సంరక్షించే విధానంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో కూఆ పచ్చదనం పెంపొందేందుకు మొక్కలు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఏపీడీ సుబ్బారెడ్డి, ఏపీఓ గంగరాజు, ఈసీ భాస్కర్, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాహిమాం..మాతా అన్నపూర్ణేశ్వరి

కడప (కల్చరల్), అక్టోబరు 6: దసరా ఉత్సవాలు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిసేవలో తరించారు. విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కూష్మాండదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వేకువజామున 36 విశేష పవిత్ర నది జలాలు నింపిన కళశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారికి చతుషష్టి ఉపచార పూజ నిర్వహించారు. తదుపరి 6 గంటలకు అమ్మవారి కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


విజయదుర్గా ఆలయంలో కోలాటంలో పాల్గొన్న భక్తులు


చెన్నూరులో భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన చౌడేశ్వరిదేవి


నడివివీధి గంగమ్మ ఆలయంలో నడివీధి గంగమ్మ అలంకారం


రామలింగచౌడేశ్వరి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారం


వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మీదేవిగా...


సోమసుందరేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీదేవిగా..


బాలపోలేరమ్మ ఆలయంలో బాలపోలేరమ్మ దేవి అలంకారం


సింహాద్రిపురం: అన్నపూర్ణాదేవి అలంకరణలో చౌడేశ్వరి దేవి


వేంపల్లె అమ్మవారిశాలలో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి


చింతకొమ్మదిన్నెలో త్రిపురసుందరీదేవిగా గంగమ్మ తల్లి


పులివెందుల: అమ్మవారిశాలలో గాయత్రిదేవి అలంకారం

భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప (నాగరాజుపేట), అక్టోబరు 6 : కడప చిన్నచౌకు పరిధిలో సర్వేనెం.384లో వంకపోరంబోకు 15 సెంట్ల స్థలం నందు తిలక్‌నగర్ దళితులకు చెందిన స్మశాన స్థలం ఆక్రమించుకుని వారిని బెదిరించి అక్కడ చదను చేసిన ఆక్రమణదారుడిని అధికారులు వెంటనే శిక్షించాలని ప్రభుత్వ భూసంరక్షణ సంఘం అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజంపేటలో నివాసం ఉండే పొత్తపి మాజీ సర్పంచ్ ఈ అక్రమణలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వెంటనే ఆ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేమన తత్వాన్ని ఒడిసిపట్టిన ప్రొఫెసరు శివారెడ్డి

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 6 : వేమన తత్వాన్ని పరిశీలించి పరిశోధించి వేమనను శూన్యవాదిగా చెప్పిన మొట్ట మొదటి వ్యక్తి ప్రొఫెసరు శివారెడ్డి అని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో వైవీయూ రసాయన శాస్త్ర విశ్రాంత ప్రొఫెసరు జి.శివారెడ్డి రచించిన వేమన పద్యాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాల్లో ఉన్న ఇరుక, బయలు అనేపదాల గురించి బాగా విశ్లేషించి వేమన ఏ మతానికి చెందినవాడు కాదని, అతని తత్వం నాగార్జున అని శూన్యవాదానికి దగ్గరగా ఉందని నూతన కోణాల్లో చెప్పడం విశేషమన్నారు. జిల్లారచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లిఖార్జున రెడ్డి మాట్లాడుతూ శివారెడ్డి తన రచనల్లో కులవ్యవస్థను వేమన వ్యతిరేకించారని అందరూ శూద్రులేనని, సంస్కారవంతంగా మాత్రమే బ్రాహ్మణులుగా మారుతారని అనడం ఆయన పరిశీలన దృష్టికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితలసంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కోశాధికారి డాక్టర్ రెడ్డి శేఖరరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పెమ్మసానిని కలిసిన పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు


పెమ్మసానికి కృతజ్ఞతలు తెలుపుతున్న వంశీ, వరుణ్

పులివెందుల టౌన్, అక్టోబరు 6 : గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానిని పులివెందుల పోస్టల్ జీడీఎస్ ఎంప్లాయిస్ ఉద్యోగులు ఆదివారం కలిసి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ శాఖలో గ్రామీణ డాక్ సేవక్‌లుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి కోసం 2022, 2023 సంవత్సరాల్లో 2వేల మంది అభ్యర్థులు పరీక్ష రాశారని, అయితే ఏపీలో ఖాళీలు లేనందున తమకు ఉద్యోగోన్నతి కల్పించలేదని తెలిపామన్నారు.ఢిల్లీలో 3600 పోస్టులు ఖాళీ ఉండడంతో అక్కడ ఉన్నతాధికారులకు 11 నెలల క్రితం వినతిపత్రం అందించామని, అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని పెమ్మసాని దృష్టికి ఈ సందర్భంగా తీసుకువచ్చారు. సమస్యపై పెమ్మసాని స్పందిస్తూ ఢిల్లీ అధికారులతో చర్చించి మూడు వారాల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని నెరవేర్చినందుకు ఆయనకు వరుణ్, వంశి, నవీన్, కుళాయిశెట్టి శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కమలాపురం రూరల్, అక్టోబరు 6 : మండలంలోని గంగవరం గ్రామ సచివాలయం పక్కన పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన చెప్పిన సమాచారం మేరకు గంగవరం సచివలయం సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.3860 డబ్బులు స్వాధీనం చేసుకుని వారి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌కు మంచి రోజులు : తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 6: అటు దేవంలోను, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తున్నాయని ఏపీసీసీ ముఖ్య అధికారప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో మూడురాష్ట్రాలలో కాంగ్రెస్ సొంతంగా ఉందన్నారు. ఆరు రాష్ట్రాలలో ఇండియా కూటమి అధికారంలో ఉందన్నారు. 2019లో కాంగ్రెస్ 52 లోక్‌సభ స్థానాలలో గెలవగా 2024లో 99 స్థానాలలో గెలిచిందన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్‌ప్రకారం కాంగ్రెస్ మంచి మెజారిటీతో అధికారంలోకి రాబోతోందన్నారు. జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫిరెన్స్‌తో కలిసి కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందన్నారు. ఏపీలో కూడా కాంగ్రెస్ రోజురోజుకు పుంజుకుంటోందన్నారు. జగన్ పార్టీ అటు అధికార పార్టీగా, ఇటు ప్రతిపక్ష పార్టీగా వైఫల్యం చెందిందన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

కడప (క్రైం), అక్టోబరు 6 : అటవీ శాఖలో విధులు నిర్వహిస్తూ రిటైర్డ్ అయినఉద్యోగులకు ఆదివారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు కడప అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. అటవీ విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు శాంతి సాగర్ హా స్పిటల్ వైద్యులు ఈ కంటి పరీక్షలు నిర్వహించారు. ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు వారి కంట్లో శుక్లాలు ఉండడంతో వైద్య పరీక్షలు నిమిత్తం కర్నూలు శాంతి సాగర్ హాస్పిటల్‌కు పంపించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో కమలాపురం కుర్రోడి ప్రతిభ

కమలాపురం రూరల్, అక్టోబరు 6 : కమలాపురం పట్టణానికి చెందిన ఎస్.మహ్మద్ సూఫియాన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. సూఫియాన్ కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14బాలుర విభాగం కిడ్స్ జావలిన్ త్రో ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు.

ఇళ్లలో చోరీకి పాల్పడే దొంగ అరెస్ట్

● 7 లక్షల విలువ చేసే నగలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుధాకర్, పక్కన సీఐ ఎల్లమరాజు, సిబ్బంది

రాజంపేట టౌన్, అక్టోబరు 6: రాజంపేట పట్టణంలో గతనెలలో క్రిష్ణానగర్‌లోని కొప్పా నాగరాజ ఇంటిలో చోరీకి పాల్పడి దొంగను పోలీసులు అరెస్టు చేసి.. నగలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పట్టణంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఎస్.సుధాకర్ వివరాలు వెల్లడించారు. చోరీకి పాల్పడిన నిందితుడు కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన వేములపల్లె విజయకుమార్ పలు నేరాల్లో నిందితుడిగా ఉన్నారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలో నివాసం ఉంటున్నారు. విలాసాలకు బానిసైన విజయ్‌కుమార్ దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈనేపథ్యంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతూ ఉంటారు. ఈనేపథ్యంలో రాజంపేట పట్టణంలో గత నెల నాగరాజు దంపతులు గాఢ నిద్రలో ఉన్నట్లు గమనించి ఇంటిలోని నగలు, నగదును చోరీ చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఎస్పీ ఎస్.సుధాకర్ మేరకు సీఐ ఎల్లమరాజు, ఎస్‌ఐలు ప్రసాద్‌రెడ్డి, నాగేశ్వర రావు, ఏఎస్ఐ రాజు, సిబ్బంది చాకచక్యంగా చోరీకి పాల్పడిన నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనుంచి 138 గ్రాముల బంగారు, 9 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 7 లక్షలకు పైగా ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

బొలెరో వాహనం ఢీ... వ్యక్తి మృతి



చంద్రమోహన్ మృతదేహం

చాపాడు, అక్టోబరు 6: మండలంలోని వి.రాజుపాళెం గ్రామంలో ఈనెల 5వ తేదీ శనివారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిమూలం చంద్రమోహన్ (50) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... చంద్రమోహన్ తన ఇంటి వద్ద బయట మంచం మీద నిద్రిస్తుండగా తిప్పిరెడ్డిపల్లె గ్రామం నుంచి వెదురూరు గ్రామానికి వెళుతున్న ఎపీ28డీఎల్3547 అనే నంబరుగల బొలెరో వాహనం ఢీకొంది. దీంతో చంద్రమోహన్ వెన్నముఖ విరిగి తలకు వెనుక భాగంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, వాహనాన్ని డ్రైవర్ అతి వేగంతో నడపడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



పుల్లంపేట, అక్టోబరు 6: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరివేసుకుని అదే గ్రామానికి చెందిన బిట్ర వెంకటస్వామి (65) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఆదివారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజంపేటకు తరలించారు. మృతుడు వెంకటస్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, ఇతిని మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి శవం లభ్యం



అమర్ (ఫైల్ ఫొటో)

మైదుకూరు రూరల్ అక్టోబరు 6: దువ్వూరు టౌన్ ఎస్టీ కాలనీకి చెందిన తంగెడుపల్లె సాయి కుమార్ కుమార్ తన కుమారుడు తంగె డుపల్లె అమర్(2) ఇంటి వద్ద అడుకుంటూ ఈనెల 3వ తేదీ తప్పి పోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం మొరాయి పల్లె వద్ద కేసీ కెనాల్ కాలువలో అమర్ మృతదేహం లభ్యం అయినట్లు పోలీ సులు తెలిపారు. సాయికుమర్ ఇంటి సమీ పంలో కేసీ కాలువ ఉండటంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రొద్దు టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



వీరబల్లి, అక్టోబరు 6: మండల పరిధిలోని సానిపాయి పంచాయతీకి చెందిన నేతి పిచ్చోళ్ల బలరామయ్య (55) శనివారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు... ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్దకుమారుడు హైదరాబాదులో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. మిగతా ఇద్దరినీ అతని భార్య తిరుపతిలో నివాసం ఉంటూ చదివించుకుంటోంది. బాలరామయ్య ఒక్కడే సానిపాయిలో ఉంటూ.. మద్యానికి బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక పురుగులమందు తాగి మరణించినట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నీటిలో కొట్టుకుపోతున్న బాలుడిని కాపాడిన యువకుడు



మైదుకూరు రూరల్ అక్టోబరు 6: ఈత కోసం నీటిలో దిగి కొట్టుకుపోతున్న బాలుడిని సాహసేపేతంగా నీటిలోకి దూకి ఓ యువకుడు కాపాడాడు. వివరాల్లోకి వెళితే.. నల్లమల అడవుల్లో ఉన్న భైరవకోనకు శని, ఆదివారాలలో భక్తులు దర్శనం కోసం వెళుతుంటారు. ఆదివారం భైరవకోనకు వెళ్లి వస్తూ తిప్పిరెడ్డిపల్లె ప్రకాశ్‌నగర్ వద్ద తెలుగుగంగ ఎస్ఆర్2 నుంచి బ్రహ్మంసాగర్‌కు వెళ్లే కెనాల్‌లో ఓ యువకుడు, బాలుడు కలిసి ఈత కోసం దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకు పోతుండగా మొదట యువకుడిని అటుగా వెళుతున్న కొందరు భక్తులు కాపాడారు. కాని బాలుడు నీటిలో మునిగిపోతుండగా.. అదే సమయంలో అటువైపుగా కారులో వెళుతున్న సోమిరెడ్డిపల్లెకు చెందిన ఇడమడక సాయి అనే యువకుడు కాలువకట్టపై గుంపులుగా ఉన్న జనాలను చూసి దిగాడు. విషయం తెలుసుకుని సాహసే పేతంగా నీటి ప్రవాహంలోకి దూకి బాలుడిని కాపాడాడు. భక్తులతో పాటు స్థానికులు ఇడమడక సాయిని అభినందించారు.

ఆశలన్నీ రబీపైనే..

● సాగు లక్ష్యం 1,42,812 హెక్టార్లు

● ఎరువులు, విత్తనాల పంపిణీకి అధికారులు సమాయత్తం

● నిరాశ నిస్పృహల మధ్య ముగిసిన ఖరీఫ్

● 3,509 హెక్టార్లలో ఎండిన పంటలు



కడప(రూరల్), అక్టోబరు 6: అడపాదడపా వర్షాలతోనే ఖరీఫ్ కాలం ముగిసింది. వెరసి రైతులకు నష్టాలను, కష్టాలను మిగిల్చింది. అన్నదాత ఖరీఫ్ కష్టాలను వెంటబెట్టుకొని కోటి ఆశలతో రబీలోకి ఆడుగుపెట్టాడు. మరో పక్క జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రబీ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు 1,42,812 హెక్టార్లలో వివిధ పంటలు సాగు లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇందుకు సంబంధించి 75,597 క్వింటాళ్ల విత్తనాలు అవసరంగా భావించారు. ఇందులో బుడ్డశనగ విత్తనాలు 72,386 క్వింటాళ్లు, వేరుశనగ విత్తనకాయలు(కె6) 1,800 క్వింటాళ్లు, మినుము విత్తనాలు 967 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 328 క్వింటాళ్లు, కందులు 15.5 క్వింటాళ్లు, కుసుమ 70 క్వింటాళ్లు, కొర్ర 18 క్వింటాళ్లు, రాగి 4 క్వింటాళ్లు అవసరంగా భావించి సిద్ధం చేస్తున్నారు.

77,100 మెట్రిక్ టన్నుల ఎరువులు

రబీలో వివిధ పంటల సాగుకు గాను 77,100 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరంగా అంచనా వేశారు. ఇందులో యూరియా 30,230.55 టన్నులు, డీఏపీ 5,232.61 టన్నులు, ఎంవోపీ 2,861.31 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 38,146 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 2,628.73 టన్నులు అవసరంగా భావించారు.

కష్టాలను మిగిల్చిన ఖరీఫ్

2024 ఖరీఫ్ కాలం సెప్టెంబరు 30తో ముగిసింది. ఈ సీజన్‌లో పంటలకు కష్టకాలం దాపురించి నష్టాలను మిగిల్చింది. నైరుతి రుతుపవనాలు అసమతుల్య వర్షాలను కురిపించడంతో వర్షాధార పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 403.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 391.5 మి.మీ నమోదయింది. ఈ వర్షం ఖరీఫ్ ప్రారంభం.. ముగింపు దశలలో మాత్రమే కురవడంతో పంటలకు ఏమాత్రం ఉపయోగపడలేదు. అదునుకు వానలు పడకపోవడంతో ఖరీఫ్ పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. వేరుశనగ, మినుము తదితర పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు వాటిని పశువులకు వదిలేశారు. 2024 ఖరీఫ్‌లో 75,189 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా ముగింపు నాటికి 66,998 హెక్టార్లలో పలు పంటలు సాగుకు నోచుకున్నాయి.

ఇందులో వర్షాధారం కింద సాగైన పంటలలో 3,509 హెక్టార్లు ఎండిపోయినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. వాస్తవంగా ఇంతకంటే రెట్టింపు హెక్టార్లలో పంటలు ఎండిపోయినట్లు రైతులు, రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు.

రబీలో పంటల సాగు లక్ష్యం హెక్టార్లలో..

పంట	విస్తీర్ణం
బుడ్డశనగ	82,261
మినుము	14,731
వరి	11,278
జొన్న	7,917
వేరుశనగ	6,236
కుసుమ	5,070
పొద్దుతిరుగుడు	3,244
పెసర	3,182,
పత్తి	2626
సజ్జ	2,194
మొక్కజొన్న	1,440
కొర్ర	563
ఉలవలు	428
కందులు	202
రాగి	57

రబీ సాగుకు సమాయత్తం

రబీ సీజన్ అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఖరీఫ్‌లో ప్రారంభమైన నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్ మొత్తంలో 212.3 మి.మీ వర్షపాతం అవసరం. ఇందులో అక్టోబర్ నెలలో 132.1 మి.మీ, నవంబర్‌లో 61.6 మి.మీ, డిసెంబర్‌లో 18.6 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ రైతులను ముంచేసింది. రబీలో అయినా నైరుతి రుతుపవనాలతో తాము గట్టెక్కుతామనే ఆశతో రైతులు పంటల సాగుకు సమాయత్తం అవుతున్నారు. బోరుబావుల కింద, కేసీ కెనాల్ పరిధిలో ఇప్పటికే వరినాట్లు వేశారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ : ఎమ్మెల్యే ఆది



వైద్య శిబిరంలో డాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పక్కనే భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 6: రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి లేకుండా భ్రష్టు పట్టించాడని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించారు. ఆదివారం జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పక్కన బెట్టి భారతీరాజ్యాంగం నడిపిన జగన్‌రెడ్డి చివరకు రైతుల పాస్‌పుస్తకాల్లో సైతం తండ్రి పేరు పెట్టుకోవడం చేసి ప్రజలు అసహ్యించుకుని ఇంటికి పంపించారన్నారు. జగన్ చిన్నాన్న వివేకా కేసులో సిట్‌ను పక్కన పెట్టమని చెప్పి తర్వాత సీబీఐ కావాలని డ్రామాలు ఆడారన్నారు. అలాగే పవిత్రమైన తిరుమల లడ్డూను కలిచేసి అపవిత్రంచేశారని, ఎవరు తప్పు చేసి ఉంటే వారిని ఆ దేవదేవుడు సినిమా చూపిస్తాడన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో ఉచిత సిలిండర్లు అందిస్తుందన్నారు. అర్హులైన రైతులకు రూ.20వేలు ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి వైఎస్సార్ జిల్లా పేరు మార్చాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో కడప జిల్లాకు వైఎస్ఆర్ జిల్లాగా నామకరణం చేశారని.. వెంటనే పాత పద్ధతిలో వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని.. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఇది ఒక చిన్న పని, ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు వద్ద జిల్లా పేరు మార్చేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ఆదివారం జమ్మలమడుగులో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి డాక్టర్లతో మాట్లాడి రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మంచి వైద్యం అందించాలని సుచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో కానీ, రాజకీయ విషయంలో కానీ ఏమాత్రం తగ్గేది లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలు ఒకరు వైడ్‌బాల్, మరొకరు నోబాల్ అంటూ ఎమ్మెల్యే విమర్శించారు. వైడ్‌బాల్, నోబాల్ అన్నింటికి తాను సిక్సర్ కొడుతానని వేచి చూస్తారని అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, దేవగుడి సుధీర్‌రెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, శివయాదవ్, వంగల నాగేంద్రయాదవ్, వి.పి.ఓబుళరెడ్డి, ముని సుబ్బారెడ్డి, సయ్యద్, ప్రదీప్ శ్రీను, మహమ్మద్‌రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక టిప్పర్లు స్వాధీనం



జమ్మలమడుగు, అక్టోబరు 6: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున జమ్మలమడుగు అర్బన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. కొండాపురం పరిసర ప్రాంతాల నుంచి ముద్దనూరు రోడ్డు మీదుగా జమ్మలమడుగుకు ఇసుక తరలిస్తున్న ఐదు టిప్పర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి పోలీసు స్టేషన్ ఆవరణంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తొలి సీఎన్జీ బైకు ఆవిష్కరణ

మార్కెట్లోకి విడుదల చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు



బజాజ్ ఫ్రీడం సీఎన్జీ బైకును మార్కెట్లోకి విడుదల చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా. మేయరు సురేశ్‌బాబు

కడప (క్రైం), అక్టోబరు 6: భారతదేశంపు నెం.1 బజాజ్ డీలరు హరూన్ బజాజ్ వారు ఆదివారం రాజీవ్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన అతి పెద్ద స్టేజీపై తొలి సీఎన్జీ బైకు మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు పాల్గొని బజాజ్ ఫ్రీడం 125 బైకును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఎస్‌బీ అహ్మద్‌బాషా మాట్లాడుతూ తమ హరూన్‌బజాజ్ సంస్థ ప్రతి దసరాకు ఐదురోజుల పాటు మేళా నిర్వహిస్తుందని, తమ సంస్థను ఆదరిస్తున్న కడప ప్రజలకు ధన్యవాదాలని తెలిపారు. ప్రతి బైకు కొనుగోలుపై ఆకర్షణీయమైన డిస్కౌంటు ఉంటుందన్నారు. మీ వద్ద ఉన్న ఏ పాత వాహనం అయినా తీసుకువచ్చి కొత్త వాహనం తీసుకెళ్లవచ్చన్నారు. అతి తక్కువ డౌన్ పేమెంటుతో సీఎన్జీ బైక్స్ ఇస్తున్నామన్నారు. సరికొత్త బజాజ్ ఫ్రీడం బైక్ ట్విన్ ట్యాంకు సెటప్‌ని కలిగి ఉంటుందన్నారు. ఒక ట్యాంకు పెట్రోలు కోసం, మరో ట్యాంకు సీఎన్వీ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేశారన్నారు. ఇందులో రెండు రకాల ప్యూయల్ని వాడుకోవచ్చన్నారు. దసరా ఆఫర్ కింద అతి తక్కువ వడ్డీ రేటుపై స్పాట్ ఎక్సేంజ్, స్పాట్ ఫైనాన్స్ , స్పాట్ అప్రూవల్ కల్పిస్తున్నామని హరూన్ బజాజ్ జనరల్ మేనేజరు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బంగారు మునెయ్యయాదవ్, రమేశ్‌రెడ్డి, త్యాగరాజు, షఫీ, కార్పోరేటరు రామలక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు - ధర్మవరం బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి

సింహాద్రిపురం, అక్టోబరు 6: ప్రొద్దుటూరు నుంచి ధర్మవరం పట్టణానికి వయా ముద్దనూరు, తొండూరు, సింహాద్రిపురం మీదుగా ఆర్టీసీ బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. వ్యాపార కేంద్రమైన ప్రొద్దుటూరుకు ధర్మవరానికి చెందిన పట్టు చీరలు నేసే మగ్గాలవారు పట్టు చీరల వ్యాపార రీత్యా అనునిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే మండల కేంద్రాలైన సింహాద్రిపురం, తొండూరు ప్రజలకు ప్రొద్దుటూరు, ధర్మవరం వెళ్లడానికి ఈ సర్వీస్ ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ విషయాలన్నింటిని పరిగణలోకి తీసుకుని ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ సర్వీస్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కడప (క్రైం), అక్టోబరు 6 :కడప నగరం చిన్నచౌకు వద్ద ఆదివారం కారు తగలి బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుపై బోల్తా పడడంతో స్థానికులు కారును పైకి లేపి.. కారులో ఉన్న ఇరువురుని కాపాడారు. చిన్నచౌకు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రతి ఆదివారం జాతరే..


● రైతు దాతృత్వం..

● రహదారి కోసం స్థలం విరాళం

● రోడ్డు సౌకర్యంతో పెరిగిన భక్తులు

సీకేదిన్నె, అక్టోబరు 6: చింతకొమ్మదిన్నె కొత్తపేట గంగమ్మ ఆలయం వద్ద ప్రతి ఆదివారం జాతరను తలపిస్తుంది. ఇక్కడ ప్రతి సంవత్సరం శివరాత్రి 3వ రోజు, 4వ రోజుల్లో తిరుణాళ్ల జరపడం ఆనవాయితీ. అనంతరం ఉగాది వరకు వచ్చే ఆదివారాలలో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అయితే ఆలయానికి కడప-రాయచోటి ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మించిన తర్వాత భక్తుల సంఖ్య భారీగా పెరిగింది.

ఎకరా స్థలం రోడ్డుకు విరాళం ఇచ్చిన రైతు



దాత రామచంద్రయ్య

చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లెకు చెందిన రైతు కే.శే.వినుపోలు రామచంద్రయ్య కడప-రాయచోటి జాతీయ రహదారి నుంచి గంగమ్మ ఆలయం వరకు దాదాపు ఎకరా స్థలాన్ని తన పొలం నుంచి రోడ్డుకు కేటాయించారు. దీంతో భక్తుల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంది. సిమెం టు రోడ్డు కూడా ఏర్పాటు చేశారు. రైతు రోడ్డుకు స్థలం ఇవ్వడంతోపాటు ఆర్చి నిర్మాణం చేపట్టడంతో గంగమ్మ ఆలయం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. దీంతో ఆలయానికి వచ్చేందుకు భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉండడంతో అప్పటి నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో రావడం మొదలుపెట్టారు.



కడప-రాయచోటి రహదారిలో నిర్మించిన ఆర్చి

పెరిగిన భక్తుల రద్దీ

గంగమ్మ ఆలయానికి వచ్చేందుకు రోడ్డు సౌకర్యం మెరుగు కావడంతో భక్తులు ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. తిరుణాళ్ల జరిగినప్పటి నుంచి ప్రతి ఆదివారం భక్తులు వస్తూనే ఉంటారు. దీంతో అమ్మవారు ఆలయం విశేష ప్రాచుర్యంలోకి వచ్చింది. సంతానం లేనివారు, రైతులు, వ్యాపారులు అమ్మవారికి మొక్కుకుని.. వారి కోర్కెలు తీరాక మొక్కులు తీర్చుకుంటుంటారు. భక్తులకు అవసరమైన గదులు, ఆలయం సమీపంలో కల్యాణ మండపం సైతం నిర్మించడంతో భక్తులకు ఎంతగానో సౌకర్యంగా ఉంది.





విశేష అలంకరణలో గంగమ్మ తల్లి ఆలయం వద్ద క్యూలైన్లలో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

నేడు బండిభాస్కర్‌రెడ్డి అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు,అక్టోబరు 6 : ప్రొద్దుటూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బండి విజయ భాస్కర్‌రెడ్డి భౌతిక కాయానికి సోమవారం ఉదయం మండల పరిధిలోని పెద్ద శెట్టిపల్లె గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యుడు టీడీపీ మండల అధ్యక్షుడు బోడెల బాబుల్‌రెడ్డి తెలిపారు. భాస్కర్‌రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బీటెక్ రవి, పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మల్లెల మురళీధర్‌రెడ్డి ఉన్నారు. వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు.

విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 6: విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం గోల్డెన్ పార్కులో కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

●మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి


స్విచ్ ఆన్ చేసి నూతన రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

మైలవరం, అక్టోబరు 6: రైతులకు అందుబాటులోకి వచ్చిన నూతన రైస్‌మిల్లును సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కరమలవారిపల్లి గ్రామ సమీపంలోని జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సాంబశివ రైస్‌మిల్లును మాజీ ఎమ్మెల్సీ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, రైస్‌మిల్లు అధినేత చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ రఘనాథరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వాటర్‌ఫిల్టర్ వితరణ

జమ్మలమడుగు, అక్టోబరు 6: జమ్మలమడుగు పట్టణంలో ప్రభుత్వ శాఖా గ్రంథాలయానికి దివంగత విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ కొండారెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ వాటర్‌ఫిల్టర్‌ను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రిన్సిపాల్ బండారు శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రంథాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి చేతుల మీదుగా వాటర్‌ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవు నీవే... అఖిల జగాలకు





బద్వేలులో పార్వతీదేవి, కాశినాయనలో భవానీ, ముద్దనూరులో గాయత్రీదేవి, ఎర్రగుంట్ల అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

బద్వేలుటౌన్, అక్టోబరు 6 : దేవీశరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కళకళలాడుతున్నాయి. ఆదివారం స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమి చ్చారు. మహాలక్ష్మీదేవి ఆలయంలో సరస్వతీదేవి అలం కారం, కోదండరామస్వామి ఆలయంలో వామన అవతా రం, వీరభద్రస్వామి ఆలయంలో జగన్మోహినీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాశినాయన..: నర్సాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముద్దనూరు..: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల్లో అమ్మవారు నాలుగో రోజు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎర్రగుంట్ల..: అమ్మవారిశాలలో వాసవాంబ, ఏరువాక గంగమ్మ అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా, చౌడేశ్వరీదేవి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. చిలమకూరులోని వేంకటేశ్వర స్వామి, ఎర్రగుంట్ల మహేశ్వరనగర్‌లోని శివాలయంలోపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కొండాపురం..: మండలంలోని దత్తాపురం పెద్దమ్మ గుడిలో ఆదివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్లలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిఆలయంలో ఆదివారం రాత్రి కామాక్షిదేవి అలంకారాన్ని చేశారు.భక్తులుపూజలు నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం..: మండల కేంద్రంలో ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అలాగే శ్రీఈశ్వరీ దేవి అమ్మవారి సన్నిధానంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరులోని అమ్మవారి శాలలో ఆదివారం మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు నూరిశెట్టి ప్రసాద్ గుప్తా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

ఖాజీపేట..: వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగు..: దసరా శరన్నవరాత్రులలో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి శరన్నవరాత్రులలో భాగంగా 4వ రోజు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ముద్దనూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులు పూజలు చేశారు. నాగులకట్ట శ్రీ చౌడేశ్వరీదేవాలయం, అంబాభవానీదేవాలయం, కన్నెలూరులోని చౌడేశ్వరీదేవి ఆలయం, గంగమ్మ ఆలయం, లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.


మైదుకూరు అమ్మవారిశాలలో మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు






కొండాపురం.. లలితా త్రిపురసుందరీ దేవి, పోరుమామిళ్లలో కామాక్షిదేవి,బీ మఠం..అమ్మవారిశాలలో అన్నపూర్ణదేవి, ఖాజీపేటలో గజలక్ష్మీదేవి, జమ్మలమడుగు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి బాలత్రిపుర సుందరీదేవి అలంకారాల్లో దర్శనిమిస్తున్న అమ్మవారు

షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలి

బద్వేలు, అక్టోబరు 6 : పట్టణంలోని విభిన్న ప్రతిభావంతులకు షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ వారికి రుణాలు మంజూరు చేసి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని వారి అర్హతకు తగ్గట్లు గా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అలాగే వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు ప్రసాద్, వెంకటేశ్వర్లు, లక్షుమ్మయ్య తదితరులుపాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీ శనగల కూపన్లు పంపిణీ

మైలవరం, అక్టోబరు 6: మైలవరం మండలంలో సోమవారం నుంచి గ్రామ సచివాలయాల్లో సబ్సిడీ శనగ విత్తనాలకు కూపన్లు పంపిణీ చేయనున్నట్లు ఏవో విజయారావు ఆదివారం తెలిపారు. మైలవరానికి 2,889 క్వింటాళ్ల శనగలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శనగ విత్తనాలు మంజూరు

ముద్దనూరు అక్టోబరు6:మండలానికి రబీ సీజన్‌కు 1047 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏవో వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.25 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నట్లు,ఎకరా పొలంలోపు రైతులకు 20కిలోలు,ఎకరం పై బడిన రైతుకు 40కిలోలు చొప్పున 5ఎకరాలు పొలం వరకు గరిష్ఠంగా ఉందిస్తున్నట్లు తెలిపారు.క్వింటా ధర రూ.9400 కాగా రూ.2350 రాయితీ పోను రూ.7050 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేటి నుంచి బుడ్డశనగ విత్తనాలు పంపిణీ

జమ్మలమడుగు, అక్టోబరు 6: జమ్మలమడుగు మండలంలోని రైతులకు సోమవారం నుంచి బుడ్డశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏవో గురుభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు మండలానికి మొత్తం 3,400 క్వింటాళ్లు బుడ్డశనగలు మంజూరయ్యాయని, క్వింటా ధర రూ.9,400 సబ్సిడీ 25 శాతంతో రూ.2,350 పోను రైతు వాటా రూ.7,050 క్వింటా ధర ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బుడ్డశనగలు కావాల్సిన రైతులు తప్పకుండా తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు తీసుకుని వారి రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవాలని తెలిపారు. నిబంధనల ప్రకారం రైతులకు అధికారులు పంపిణీ చేస్తారన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రొద్దుటూరు, అక్టోబరు 6 : మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో ఆదివారం మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. టంగుటూరులోని శ్రీమదన గోపాలస్వామి ఆలయంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఆ గ్రామానికి చెందిన బయపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం జరిగింది. ప్రొద్దుటూరు పట్టణంలోని యశ్వస్వి ఆర్థోపెడిక్ వైద్యులు అక్షిత్‌సాయి, బాలాజీ హాస్పిటల్ డయాబెటాలజిస్ట్ వైద్యులు ఎం.పవనకుమార్‌రెడ్డి, స్కిన్ స్పెషలిస్ట్ ఉదయకిరణ్, రాజమహేంద్ర హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యనిపుణుడు నాగవీరేంద్ర పాల్గొన్నారు. గ్రామంలోని దాదాపు 400కు పైబడి వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మానికింది ఖాదర్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు గుత్తి దస్తగిరి, కొట్టాల జగన్‌మోహన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎర్రగుంట్ల, అక్టోబరు 6: ఎర్రగుంట్ల మండలంలోని హనుమనగుత్తి ఎస్సీ కాలనీలో శనివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. టీడీపీ-వైసీపీలకు చెందిన వారి మధ్య పాత కక్షలు వల్లే ఈ ఘర్షణ జరిగినట్లు పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడ్డ వెంకట రాముడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహాధర్నా విజయవంతం చేయండి

బద్వేలు రూరల్, అక్టోబరు 6 :విజయవాడ ధర్నా చౌక్‌లో ఈనెల 9న బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ కుల గణన కోసం జరిగే మహాధర్నాలో రాష్ట్ర నలుమూలల నుంచి బీసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని జాతీయ బీసీ చైతన్యసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికైనా బీసీ కుల జన గణన జరిపి బీసీల సమగ్రాభివృద్ధికి పాటుపడాలని లేదంటే దేశవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలిపారు.

పరిశుద్ధ జపమాల రాఖీ గ్రామోత్సవం

పోరుమామిళ్ల, అక్టోబరు 6 : స్థానికహోలీ రోసరీ చర్చి ఆవరణలో పరిశుద్ధ జపమాల రాఖీ తిరుణాల సందర్భంగా ఆదివారం రాత్రి పరిశుద్ధ గ్రామోత్సవం నిర్వహించారు.గిరినగర్ సమీపంలోని ఆర్సీయం చర్చి నుంచి ఓఎల్ఎఫ్ హైస్కూలు సమీపంలో ఉన్న హోలిరోసరీ చర్చి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద చెరువు తూములకు మరమ్మతులు చేయించాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 6 :పోరుమామిళ్ల పెద్దచెరువు తూములకు మరమ్మతులు చేయించి లీకేజీలు అరికట్టాలని సీపీఐ ఏరియా సహాయకార్యదర్శి పిడుగుమస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల సీపీఐ బృందం, చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ దెబ్బతిన్న తూములను పరిశీలించారు. సీపీఐనాయకులు పాల్గొన్నారు.

ప్రసాదరావుకు గడియారం సాహిత్య పురస్కారం ప్రదానం


పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 6: గీతాశ్రమంలోని ఎస్వీడిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం డాక్టర్ గడియారం వెంకటశేష శాస్త్రి 43వ సాహిత్య పురస్కార సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లాకు చెందిన సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు రచించిన శంభుభారతం కావ్యానికి గడియారం వెంకటశేషశాస్త్రి సాహితీపురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు భూతపూరి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ గడియారం వెంకటశేషశాస్త్రి శివభారతం కావ్యాన్ని రచించి తెలుగు సాహితీరంగంలో సుస్థిరస్థానం పొందారన్నారు. ఈ ఏడాది రామక్రిష్ణప్రసాదరావు రచించిన శంభుభారతానికి గడియారం పురస్కారం అందజేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం గడియారం కుటుంబీకులు ముడియం కిశోర్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ గుడికి విరాళం


గుడికి విరాళం అందజేస్తున్న సి.గోవర్ధన్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 6: జమ్మలమడుగు మండలంలోని చిటిమిటి చింతల గ్రామంలో ఆదివారం సాయంత్రం సేవాలాల్ మారెమ్మ అమ్మవారి గుడికి రూ.2 లక్షలు కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని కూటమి నాయకులతో కలిసి గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆలయానికి రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. విరాళాన్ని గుడి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రామస్వామినాయక్, హనుమంతనాయక్, హరికృష్ణనాయక్, రామదాసు, వెంకటేష్‌నాయక్, లాలానాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున



ప్రొద్దుటూరు, అక్టోబరు 6 : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా వి.మల్లికా ర్జునను నియమిస్తూ ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ జీవో ఆర్‌టీ నెంబరు 775ను ఆదివారం విడుదల చేశారు. మల్లికా ర్జున ధర్మవరం నుంచి ప్రొద్దుటూరు కు బదిలీ కాగా ఇక్కడ వున్న కమిషనర్ రఘునాథరెడ్డి బాపట్లకు బదిలీఅయ్యారు. జమ్మలమడుగు కమిషనర్‌గా వున్న ప్రమోద్ కుమార్‌ను ధర్మవరానికి బదిలీ చేశారు. కాగా ప్రొద్దుటూరు ఎంపీడీవోగా సూర్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈయన అన్నమ య్య జిల్లా రామాపురం మండలం నుంచి ఇక్కడి కి బదిలీ పై వచ్చారు. ఇక్కడ వున్న ఎంపీడీవో కుళాయమ్మ వేంపల్లెకు బదిలీ పై వెళ్ళారు.